

# కథా కౌముది


## ఇంగ్లీష్ టీచర్

డా.పేరం ఇందిరాదేవి

సుజన ఆరోగ్యం బాగా పాడయ్యింది. ఏమీ మాట్లాడదు. మాట్లాడుతూ మాట్లాడుతూ మౌనంగా అయిపోతుంది. యాభై లోకి రాగానే కోర్టు లో తన క్లర్క్ వుద్యోగానికి వాలంటరీ రాజీనామా ఇచ్చేసింది.

నేను ఆఫీసు నుండి ఇంటికి వచ్చేప్పటికి నవ్వుతూ కాఫీ అందించేది, అక్కడి కెళదాం ,ఇక్కడికెళదాం అని ప్రణాళికలు పెట్టేది, నాకు పని వత్తిడి ఉంటే తన స్నేహితులతో వెళ్లిపోయేది , షాపింగ్ లని ,కిట్టీ పార్టీలని , స్నేహితుల పిల్లల పెళ్లిళ్లకు చక్కగా అలంకరించుకుని వెళ్ళేది.

మా సంతానం అజయ్, అనిమ బాగా చదువుకున్నారు, అనిమ తానే మంచి వరుడ్ని ఎన్నుకుంది, పెళ్లి చేశాం, భర్తతో అమెరికా వెళ్ళిపోయింది, అజయ్ కూడా అమెరికాలోనే ఎమ్మెస్ చేశాడు , తర్వాత ఎంబీఏ చేసి వుద్యోగం చేస్తున్నాడు. మొన్నటి వరకు ఏమీ ఆదుర్దా పడే విషయాలు ఉండేవి కావు. కానీ సుజన కొద్ది రోజులుగా ప్రతి చిన్న విషయానికి కోపం, విసుగు చూపడం, ఏడవటం ఇలా తన నైజం కానివి చేస్తోంది. ఎవరినీ కలవడానికి ఇష్టపడడం లేదు, ఎవరైనా వచ్చినా మొక్కుబడిగా పలకరించడం, టీవీ కూడా పెట్టుకోకుండా గదిలోనే ఎప్పుడూ పడుకోవడం, కారణం అడిగితే తలనొప్పి అనడం, డాక్టర్ దగ్గరకు వెళదామంటే తర్వాత వెళదాం అని చెప్పేసి తప్పించుకోవడం, గట్టిగా నిలదీస్తే ఏడవటం. నాకేమీ అర్థం కావడం లేదు మోనోపాజ్ సమస్య అని డాక్టర్లు అన్నా , ఆమె ఎక్కువ దిగులు పడుతున్నది అజయ్, అనిమల గురించి అని నాకు తెలుసు. వాళ్ళను అమెరికా పంపడానికి సుజన వ్యతిరేకించలేదు. వెళ్ళాక కూడా రెండేళ్లు వాళ్ళు దూరంగా వున్నారని అని బాధపడేది కూడా కాదు. స్కైప్ లో మాట్లాడుతుండేది కాబట్టి దాదాపుగా వాళ్ళని రోజూ చూసేది, వాళ్ళు వంట చేయడం కొత్త కార్లు కొనడం, పార్టీలకు వెళ్లడం స్నేహితులతో గడపడం అన్నీ స్కైప్ లో వాళ్ళు చూపడం అవన్నీ నాకు చెప్పడం, అలా కాలం బాగానే గడిచింది. రాను రాను లాప్టాప్ లో స్కైప్ సంభాషణలు తగ్గిపోయాయి, స్మార్ట్ ఫోన్లో వీడియో కాల్స్ కొద్దికాలం నడిచాయి. ఆఫీసుకు వెళ్తూ డ్రైవింగ్ చేస్తూ కొన్ని రోజులు మాట్లాడే వాళ్ళు. నెమ్మదిగా వారంలో ఒక్క రోజు ఏదో సమయంలో పలకరింపులు జరిగేవి. అనిమ అప్పుడప్పుడైనా మాట్లాడేది కానీ అజయ్ అసలు దొరికే వాడు కాదు. వాట్స్ ప్ లో కాల్ చేయమని మెసేజ్ పెట్టినా కాల్ చేయలేదని ఎప్పుడూ నాకు పిర్యాదు చేసేది, అజయ్ దొరికినప్పుడు వాడితో కన్నవారితో మాట్లాడే తీరిక లేదా అని పోట్లాడేది. వాళ్ళ ఉజ్వల భవిష్యత్ కోసం మేము చేసిన త్యాగాలు ఏకరువు పెట్టేది. కన్నవాళ్లకు అది బాధ్యత కదా అని వాడన్నాడని “వాడికి తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేదా వాడిలా మాట్లాడతేమిటండీ మీరు వాళ్ళనేమీ అనరా?” అని నాతో పోట్లాడేది.

ఇది ఇలా జరుగు తుండగానే అనిమ తన భర్త నుండి విడిపోయింది, ఇద్దరి మధ్య ఎందుకు గొడవలొచ్చాయో కూడా అనిమ తల్లితో చెప్పలేదు. కూతురు చేసిన పని అసలు నచ్చలేదు. సుజనకు అల్లుడు చాలా మంచివాడని ఇదే అతనితో చిన్నవాటికి గొడవ పడి ఉంటుందని మందలించమని నన్ను పోరుతుంటే, కూతురును అడిగాను. తన వ్యక్తిగత విషయాల్లో కల్పించుకోవడానికి మాకు హక్కు లేదని అనిమ అనడం నాకు బాధ అనిపించినా, సుజనకు అది అవమానంగా, అసహజమైన పరిణామంగా అనిపించి తీవ్ర మైన నొప్పిని కలిగించింది. ఆ వార్త ఎలాగో మా బంధువులకు కూడా తెలిసి పోయింది, తన పెంపకంలో లోపమేముందో అని ఆత్మ పరిశీలన చేసుకోవడం లోనే సుజన త్రీవ్ర ఘర్షణకు గురయ్యింది. అనిమతో

మాట్లాడినప్పుడంతా సుజన కాపురం చక్కదిద్దుకోమని చెప్పడంతో అనిమ కూడా సుజనతో మాట్లాడ్డం తగ్గించింది. పిల్లలిద్దరి ప్రవర్తన గురించి నాకు కూడా బాధగానే వుంది కానీ చేయగలిగింది ఏమీలేదని నాకు తెలుసు, కానీ సుజన వాళ్ళ కారణంగా నలగడం నాకు నచ్చడం లేదు. సైకాలజిస్ట్ దగ్గరకు తీసికెళ్ళి చూపించినా ఫలితం లేకపోయింది. ఇన్నాళ్లు పిల్లల భవిష్యత్తు గురించి ఇద్దరం ఆలోచించాము.బీ ఎస్ ఎన్ ఎల్ ఇంజనీర్ గా నాకు వుద్యోగ ధర్మంతో రోజులో సగం సమయం గడిచి పోతుంది, కానీ సుజన ఇంట్లో వుండి ఇలా వేదన పడి నలుగుతోంది.

కర్నూలు లో నేను డిగ్రీ చదువుకున్న ఉస్మానియా కాలేజ్ నుండి పూర్వ విద్యార్థుల సమ్మేళనంకు తమ భార్యలతో రమ్మని ఆహ్వానం అందింది. ముప్పైఏళ్ళ క్రిందట చదువుకున్నప్పటి తోటి విద్యార్థులను కలవడం అంటే నాకు చాలా ఉత్సాహం కలిగింది. కర్నూల్ అనగానే నాకే కాదు సుజనకు కూడా ఉత్సాహం కలుగుతుందని అనుకున్నాను. దానికి కారణం అక్కడున్న ఇంగ్లిష్ టీచర్ రేచల్. ఆమె దగ్గరే నేను సుజన కలుసుకుంది. సుజనకు రేచల్ మేడం అంటే ఎంతో ఇష్టం. మా పెళ్లయ్యాక చాలా ఏళ్ళు హైదరాబాదులో వుద్యోగం చేసినా కర్నూల్ లో మా ఇద్దరి కుటుంబాలు లేకపోయినా మేము రేచల్ మేడం ను కలవడానికి వెళ్ళేవాళ్ళం. దాదాపుగా అయిదేళ్లయింది మేడంని కలవక, క్రిస్మస్ కు గ్రీటింగ్స్ చెప్పడం తప్ప తర్వాత మేడంకు ఫోన్లు చేయడం కూడా మర్చిపోతున్నాం. కర్నూల్ కు చాలాసార్లు వెళ్లినా మేడం లేక, కొన్నిసార్లు మాకు కుదరక, కలవలేకపోయాం.

ఇంటర్ లో ఉండగా ఇంగ్లిష్ లో సుజన నేను ఇద్దరం వెనకబడేవాళ్ళం. మేము రెండో సంవత్సరంలోకి రాగానే క్రొత్తగా వచ్చిన రేచల్ మేడం మాకు ఇంగ్లిష్ అంటే వున్న భయం పోగొట్టింది ,అంతే కాదు మాకంటే నాలుగయిదేళ్లు పెద్దదయిన మేడం మాతో ఒక స్నేహితురాలిగా కలిసిపోయి, మాలో చదువు పట్ల ఆసక్తిని కలిగించింది. ఆమెను ఇష్టపడని విద్యార్థులు ఉండేవారు కాదు. సుజన నాకు క్లాస్మేట్ అయినా పరిచయం అయింది మాత్రం మేడం ఇంటి దగ్గరే. కాలేజ్ చదువు అయినా తర్వాత కూడా చాలా మంది మేడం ఇంటికి వెళ్లేవారు, అక్కడే మా పరిచయం ప్రేమగా, పెళ్లిగా మారింది. మేడంని కలవడం వలన సుజనకు సంతోషం కలుగుతుంది. రెండురోజులన్నా కొంచం మార్పు ఉంటుంది అనుకున్నా. కర్నూల్ కు వెళదామనగానే ,రేచల్ మేడం ను చూద్దామనగానే సుజన కళ్ళలో కాంతి, ముఖంలో ఉత్సాహం కనపడగానే నాకు చాలా సంతోషం కలిగింది.

సుజన నా ప్రాణం, నా జీవితానికి ఒక అర్థం కలిగించిన జీవన జ్యోతి. ఆమెకు కష్టం కలిగించింది నా బిడ్డలు అయినా వాళ్ళను నేను క్షమించలేకపోయాను. వాళ్ళతో కోట్లాడి మరుసటిరోజు పిల్లలతో ఆమె మామూలుగా మాట్లాడగలుగుతుంది కానీ నేను వాళ్ళతో మామూలుగా మాట్లాడలేకున్నాను. సుజన తర్వాతే నాకు ఎవరైనా. ఇన్నాళ్లు రేచల్ మేడం దగ్గరకు వెళ్లాలని నాకు ఆలోచన కలగనందుకు నన్ను నేను తిట్టుకున్నాను .వారం రోజులు సెలవు పడేసి కర్నూల్ బయలుదేరాం.

మా కాలేజ్ పూర్వ విద్యార్థులతో కళకళ లాడింది. ఈ మధ్య వాట్సప్ లో మా క్లాస్మేట్స్ ఫోన్ నంబర్లు దొరకడం వలన చాలా మంది కలిసి మాట్లాడుకుంటున్నాం, మెసేజ్ చేసుకుంటున్నాము మిగతా వాళ్ళు కూడా ఇప్పుడు కలిశారు.చాలా మంది భార్యా సమేతంగా వచ్చారు అందరం సంతోషంగా గడిపాం. కానీ అందరు మాలాగే పిల్లలపట్ల నిరాశగా మాట్లాడారు, వాళ్లు ఆర్థికంగా ఉన్నతంగా ఎదిగినందుకు మంచి ఉద్యోగాల్లో వుంటున్నందుకు గర్వపడినా, వెంటనే వాళ్ళ కళ్ళలో పిల్లలు భౌతికంగానే కాక మానసికంగా దూరమయ్యారని బాధని గమనించాను .నాకు, సుజన కున్న సమస్యనే అందరిదీ కూడా అని గ్రహించాక నాకు కొంత ధైర్యం కలిగింది. కానీ సుజనకు అది తనకొక్కరికే కలిగిన బాధగా, తన దురదృష్టంగా భావించడం ఆపలేదు. నాకు ఆమెను కన్విన్స్ చేసే శక్తి సన్నగిల్లింది. ఆమెకున్న సమస్య కంటే ఆమె ఊహించుకునే సమస్యే ఎక్కువ అని నాకు అర్థమైనా అది చెప్పే ధైర్యం నాకు లేదు ఎందుకంటే సుజన మానసిక పరిస్థితి ఇప్పటి కంటే ఇంకా అధ్వాన్నంగా అవుతుందేమో అనే భయం నాకుంది.

స్నేహితులందరూ వెళ్ళిపోయాక మేము రేచల్ మేడం దగ్గరకు వెళ్లాలని ఫోన్ చేసాం.

“నేను బయట వున్నాను ఓ గంటలో వస్తాను, మీరు ఇంటికి వెళ్లిపోండి, ఇల్లు మారాను” అంటూ ఇంటి గుర్తులు చెప్పారు. సుజన కు ఉత్సాహంగా వుంది మేడం ను కలవబోతున్నందుకు.రేచల్ మేడం ఇల్లు కనుక్కోవడం కష్టమేమీకాలేదు. వూరికి కొంచం దూరంగా వుంది. చిన్న ఇల్లు పెద్ద తోట. గేటు తీసుకుని లోపలి వెళ్ళే లోపల ఒకమ్మాయి ఎదురుగా వచ్చింది.

”మేడం ఫోన్ చేశారు. మీరు స్నానం చేసుకుని రండి, కాఫీ పెడతాను, నా పేరు గాయత్రి “ అంది.

“ఓహ్ అలాగా, నేను సుజన ఇతను నా భర్త ముకుంద్ , మాకు ఇంటర్ లో మేడం లెక్చరర్, సార్ ఎలా వున్నారు ? ఏమైనా మేలేనా ?” అంది సుజన

“ ఉహూ.. అలాగే వున్నారు.. రండి చూద్దురు గానీ, ఈ మధ్య మరీ బాగా లేకుంటే స్కాన్ చేపించారు ఆ రిపోర్ట్ తీసుకుని వెళ్లారు సీతారాం డాక్టర్ దగ్గరకు, చాలా రద్దీగా ఉందట “ అంది గాయత్రి.

గాయత్రి తీసికెళ్ళిన గదిలో మంచానికి అతుక్కుని వున్న ఆయన్ని చూస్తే కళ్ళకు నీళ్ళొచ్చాయి.వాళ్ళ పెళ్ళిలో ఆజానుబాహుడైన జాన్ సార్ తో మేడం ఎంతో అందమైన జంట .మేడం పెళ్లి కి అతిథులంతా విద్యార్థులే. పదేళ్ల క్రిందట ట్రైన్ ఆక్సిడెంట్ లో వెన్నెముక దెబ్బతినడం వలన మంచానికి పరిమితం అయిపోయారు. చికిత్స కోసం ఎన్నో చోట్లకి తిరిగారు. .అయినా ఆయన పరిస్థితిలో మార్పు లేదు.

స్నానం చేసి బయటికి వచ్చేసరికి ఒక రెండేళ్ళ బాబు నా దగ్గరకు పరుగున వచ్చాడు ఎత్తుకోమని చేతులు చాస్తూ. ఎత్తుకుని ఆశ్చర్యంగా చూశాను ఎవరబ్బాయని !

మేడం నవ్వుతూ నుంచున్నారు. “ఎలా వున్నారు ముకుంద్ ? చాలాకాలం అయింది మిమ్మల్ని చూసి, ఈ మధ్య సుజనను మిమ్మల్ని గుర్తు చేసుకుంటున్నాను “

నా చేతుల్లోంచి వాడు మేడం దగ్గరకు ఉరికాడు.వాడ్ని చూస్తే గుండె నిండా హాయి నిండింది. బొద్దుగా, ఉంగరాల జుట్టుతో, కిలకిలా నవ్వుతూ హడావుడిగా అటు ఇటు తిరుగుతూ ఉంటే వాడినే చూడాలనిపిస్తుంది. మేడంలో నాకు పెద్ద మార్పేమీ కనపడలేదు అలాగే వున్నారు. ఆమెను చూస్తే నాకు ఇంటర్ రోజులు గుర్తొచ్చాయి మమ్మల్ని ఆమె తీర్చిన పద్ధతి గుర్తొచ్చింది ఎన్నో సార్లు నలుగురు అయిదుమంది అబ్బాయిలం అక్కడే భోంచేసేవాళ్ళం. ఎంతమందికి ఆమె ఇంగ్లీషంటే భయం పోగొట్టి చదువులో ముందుకు పోనిచ్చారో లెక్కలేదు. ఎంతో మంది ఆమెను దేవతలా చూసేవారు. చిరునవ్వు చెదరకుండానే ఓపిగ్గా మా ఇంగ్లిష్ రాని మొద్దుల్ని మెరకలుగా చేసిందో ! ఇలాంటి కరుణామయి ఈ రోజు మారుమూల ఓ చిన్న ఇంట్లో ,అవిటివాడై మంచాన పడ్డ భర్తతో విభవం వీడి జీవించడం నాకు మింగుడు పడలేదు.

“ చేతన్ ఉంటే సమయమే చాలదు వీడి ముద్దు మాటలు వింటే అన్నీ మర్చిపోతాం “ అని మేడం అంటుండగానే సుజన స్నానం చేసి వచ్చింది. మేడం సుజన ముఖాల్లో ఆనందం తాండవించింది. ఇద్దరూ చేతులు పట్టుకుని ఒకరినొకరు కౌగలించుకున్నారు. సుజనను అలా చూడక ఎన్ని రోజులైందో...! అనిమ అజయ్ ల గురించి దిగులు పడుతూ సుజన ఎంత పాడయ్యింది?

సుజన చేతన్ తో ఆడుకుంటూ మేడంతో మాట్లాడుతోంది.చేతన్ కొత్త పాత లేకుండా అందరి దగ్గరకు రావడం నాకు ఆశ్చర్యం కలిగింది ముగ్గురం చేతన్ ను తీసుకుని తోటలోకి వచ్చాం ఊపిరి తీసుకోలేకపోయింది సుజన. తోట అంత అద్భుతంగా వుంది అనేక రకాల పూల మొక్కలతో. హైదరాబాదులో మాకున్న అపార్ట్మెంట్ లో బాల్కనీలో సుజన కూడా చాలా చెట్లు పెట్టింది. మొక్కల మధ్య తిరుగుతూ అడిగాను.

“మీ పాత ఇల్లు అమ్మేశారా మేడం ... ఎంత పెద్ద ఇల్లు ! ఎంత బావుండేది ఆ ఇల్లు . ఎన్ని చెట్లు ! ఎన్ని మొక్కలు ... ఎందుకని అమ్మేశారు ?”

మేము చదువుకునే రోజుల్లో మేడం వుండే ఆ పెద్ద ఇల్లు మేడం ఆంగ్లో ఇండియన్ తాతగారు బ్రిటిష్ స్టైల్లో కట్టించింది. యాభై సెంట్ల లో ముందంతా పెద్ద తోట, తర్వాత పెద్ద ఇల్లు, రాజభవనం లాగా ఉండేది.ఇంట్లో ఆ కాలం నాటికే అధునాతనమైన పరికరాలు ఉండేవి. జర్మన్ షెపర్డ్, బుల్ డాగ్ ,లాబ్రిడార్ కుక్కలు ఏమీ అనకున్నా భయపడి చచ్చేవాళ్ళం. మేడం నాన్నగారు కర్నూల్ లోనే ప్రఖ్యాతి చెందిన లాయర్. మేడం ఒక్కతే కూతురు, ఇంపాలా కారులో రాజకుమారి లాగా కాలేజ్ కు వచ్చేది. ఆమెకు వుద్యోగం చేసే అవసరం లేకున్నా కేవలం బోధన పట్ల ఆమెకున్న ఆసక్తి వలన చేసేది.

ఇప్పుడు ఆ ఇల్లు అమ్మేసిందంటే ఆర్థికపరమైన ఇబ్బందుల వలన ఉండొచ్చు..

“అంత పెద్ద ఇల్లు మాకు అవసరం లేదు పైగా డబ్బు అవసరం కూడా మమ్మల్ని అది అమ్మేట్టు చేసింది. ఆ ఇల్లు అమ్మాక ఈ ఇంటిని మీ జూనియర్ సుదర్శన్ ఆరు నెలల్లో కట్టించాడు. తాతగారి ఇల్లు అని కొంచం మమకారం ఉండేది. కానీ తప్పలేదు . మేడం ముఖం లో కొద్దిగా కూడా బాధ కనపడలేదు. “

“సార్ స్కాన్ గురించి ఏమన్నారు మేడం డాక్టర్ ?”

“జాన్ నాడీ వ్యవస్థ పని చేయడం మానేస్తోంది, మెమరీ లాస్ వచ్చింది ఎవర్నీ గుర్తు పట్టడం లేదు “

“రోషన్, రోజా ఎలా వున్నారు? ఎక్కడున్నారు ? ఈ మధ్య రాలేదా ?”..

"రోషన్ జర్మన్ అమ్మాయిని పెళ్లి చేసుకుని అక్కడే వున్నాడు , రోజా స్టేట్స్ లోనే వుంది తను కూడా అమెరికాలోనే సెటిల్ అయిన అబ్బాయిని చేసుకుని సంతోషంగా వుంది.. రెండేళ్ల క్రిందట వచ్చారు .. బాగా బిజీగా వుంటారు .మేం వెళ్లాలంటే జాన్ కి హెల్త్ ఇష్యూస్... "

"అదేంటి మేడం బిజీ అంటే ఎలా? వాళ్ళను కనీ, పెంచి,పెద్ద చేసి, చదివించి ఇంత వాళ్ళు అయ్యాక వాళ్ళుతాము బిజీ అని మనల్ని పట్టించుకోకుంటే ఎలా మేడం ? ఈ కాలం పిల్లలు అందరు ఇలా తయారయ్యారేంటి? జీవితం అంటే ఇంతేనా! పిల్లల నిర్లక్ష్యం భరిస్తూ ఏడుస్తూ చావడమేనా ? అనిమ అజయ్ కూడా అంతే మేడం... ఫోన్ చేయడానికి కూడా వాళ్లకు తీరిక లేదు ఆదివారాలు శనివారాలు కూడా ఫ్రెండ్స్ తో పిక్ నిక్ లతో బిజీ అదేమని నిలదీస్తే అసలు మాట్లాడరు... , బిజీ బిజీ ఈ మాట వింటే కోపం వస్తుంది ... నా పిల్లల గురించి అనుకుంటే బాధ , మీ పరిస్థితి చూస్తుంటే .. సార్ పరిస్థితి చూస్తుంటే నాకు దుఃఖం వస్తుంది మేడం, పిల్లల్ని మీరు వచ్చేయమని అడగలేదా రోజా అమెరికాలో ఉండకపోతే వాళ్ళ నాన్న గారిని చూసుకోవడానికి ఇండియా వచ్చేయరాదా ... ఏముంది మేడం అమెరికాలో జీవితం? ఉరుకుల పరుగుల జీవితం .. డాలర్లు తప్ప అక్కడయితే నాకు ఏమీ కనపడలేదు. మనం చస్తే కూడా వాళ్ళు రావడానికి లేదు... ఏదో రావాలంటే రావాలని వచ్చే వాళ్ళకోసం శవాల్ని కుళ్లిపోయే వరకు ఫ్రీజర్ బాక్సుల్లో పెట్టడమెందుకు మేడం నేను చచ్చిపోతే వాళ్లకు చెప్పాల్సిన అవసరం కూడా లేదని ముకుంద్ కు చెప్పా మేడం ... " దుఃఖం తో గొంతు పెగల్లేదు సుజన కళ్ళలో కన్నీళ్లు బుగ్గల పై ఉరికాయి.

మేడం నెమ్మదిగా సుజనను దగ్గరకు తీసుకుని కన్నీళ్లు తుడిచింది. ఏమీ మాట్లాడలేదు. చాలాసేపు సుజన ఏడుస్తూనే వుంది. నేను ప్రేక్షకుడిని అయ్యాను. మేడం ఏమి చెబుతుందో అని ఎదురు చూశాను. ఆమె ఏమీ చెప్పలేదు సరికదా అసలు మాట్లాడలేదు. జారుతున్న సుజన కన్నీళ్లను తుడుస్తూ వుంది. తర్వాత నాకు అనిపించింది .. ఆమె ఏమిచెబుతుంది ? ఏమి చెప్పగలదు? ఆమెదీ అదే పరిస్థితి కదా !

నెమ్మదిగా సుజన తేరుకుని "సారీ మేడం .. నా బాధంతా చెప్పి మిమ్మల్ని విసిగించాను". అంది పేలవంగా నవ్వుతూ .

"ఏమీ పరవాలేదు. పద లోపలి వెళదాం. ఆ .. మర్చిపోయా నీకు కొన్ని మొక్కలు చూపాలి ఒక ఫ్రెండ్ తెచ్చిచ్చింది. పూలు రెండు నెలల వరకు వాడవు .." అని ఆ మొక్కల ప్రక్కకు దారి తీసింది.

నిజంగానే ఆ మొక్కలపై పూలు గుత్తులు గుత్తులుగా చాలా బాగున్నాయి. వాటిని చూసి సుజన ముఖం లో దుఃఖం. మాయమవడం కళ్ళు ఆనందంతో మెరవడం గమనించాను. మేడం సుజన మూడ్ ని మార్చడానికి చేసిన ప్రయత్నం ఓహ్ ఆమె ఒక గొప్ప టీచర్ అన్న విషయం గుర్తుచేసింది. అక్కడి నుండి ఇంకో ప్రక్కకు వెళ్లాం అక్కడ ఓ మూల కుందేళ్ళ చిన్న ఇల్లు వుంది. తెలుపు, గోధుమ రంగు నలుపు రంగుల్లో కుందేళ్ళను చూసి చేతన్ సంతోషం తో అరవడం సుజన కూడా చిన్నపిల్లలా వాటి దగ్గర ఆడడం నాకు సంతోషాన్నిచ్చింది.

"చేతన్ కోసం కుందేళ్ళను తెచ్చాం వీడి ఆనందం చూడు ముకుంద్ " మేడం చేతన్ చూసి మురిసిపోతోంది..

"రోజాకు , రోషన్ కు పిల్లలు లేరా మేడం " అన్నాను.

"ఇద్దరికీ వున్నారు రోషన్ కు పాప , రోజాకు కూడా పాప ఫోటోలు చూపిస్తాలే"

మొక్కల్ని , కుందేళ్ళని చూస్తున్న కొద్దీ మేడం వాటితో చాలా కాలం గడుపుతుంది అనిపించింది .

చీకటి పడుతుండగా లోపలి వెళ్లాం మేడం సార్ దగ్గరకు తీసి కెళ్ళింది . చిన్నపిల్లాడిని ఒడిలోకి తీసుకున్నట్లు అతన్ని ఒడిలోకి తీసుకుంది బుద్ధిగా ఆమె వొడిలో పడుకున్నాడు."

"ముకుంద్ సుజనా వచ్చారు చూడు... జాన్" అన్నది కానీ జాన్ సార్ మమ్మల్ని గుర్తుపట్టలేదు, మేడం మాటలు అర్థం అయ్యాయో కూడా తెలియలేదు. అన్నం పప్పు కలిపి మిక్సి కేసి మెత్తగా చేసి రెండు గిన్నెల్లో వేసింది ఒక గిన్నె నుండి స్పూన్ తో సార్ కు తినిపించింది. మరో గిన్నెలో నుండి చేతన్ కు తిని పించింది చేతన్ తింటూ ఉంటే ఆయన తింటున్నారు. చేతన్ తినకుండా ప్రక్కకు పోతే ఆయన చేతన్ లేదు కాబట్టి తాను తినమని మారాం చేస్తున్నారు. గాయత్రి చేతన్ ను పట్టుకొచ్చింది "తాతయ్య తొందరగా తినేశాడని చేతన్ని, చేతన్ తొందరగా తినేశా"దని జాన్ ని ఇద్దరినీ లాలించి బుజ్జగించి మేడం తినిపించారు,

"రోజూ ఇలాగ చేస్తే కానీ ఇద్దరు తినరు....అంతకు ముందయితే ఇద్దరికీ వేరు వేరు గా పెట్టటానికి చాలా ఇబ్బంది పడేదాన్ని .. ఇప్పుడు ఇద్దరూ పోటీగా తింటున్నారు" అన్నారు.

ఎవరీ గాయత్రి .. ఆమె బిడ్డపై మేడం కెందుకు అంత మమకారం ? మేడం సందర్భం వచ్చి నప్పుడు చెబుతారులే అనుకున్నాను

రోషన్ రోజాల ఫోటోలు చూపారు..

“జర్మన్ అమ్మాయి కోడలు గా వప్పుకున్నారా మేడం?” అంది సుజన.

“మనం వప్పుకోవడం, వప్పుకోక పోవడం అన్న ప్రశ్న ఏముంది సుజనా! వాళ్ళ పెళ్లి వాళ్ళ ఇష్టం”

“మనకేమీ ప్రమేయం లేదా... మన బిడ్డల పెళ్ళిళ్ల లో .. మన కుటుంబం లోకి వచ్చే అమ్మాయి మనకు తెలియవద్దా మేడం?“

“వాళ్ళు అనుకోవాలి కదా మనం అంతా ఒక కుటుంబం అని వాళ్ళు వాళ్ళు ఏర్పర్చుకున్నదే కుటుంబం అనుకుంటున్నారు. వాళ్ళ జీవితంలో మనకు చోటు లేదని అనుకుంటున్నారు .మనమేమి చేయగలం సుజనా? వాళ్ళు అలా అనుకున్నప్పుడు అది జర్మన్ అయినా ఇండియన్ అయినా మనకెందుకు? వాళ్ళు దూరంగా వుండాలని అనుకున్నప్పుడు మనం దగ్గరగా పోవాలని అనుకున్నా ప్రయోజం లేదు కదా ! మనకు దగ్గరగా రావాలని ప్రయత్నించే వాళ్లను ప్రేమించే నైజం మనంఅలవర్చుకోవాలి...లేకపోతే మనకు ప్రేమించడానికి ఎవరూ వుండరు, మనల్ని ప్రేమించే వాళ్ళు వుండరు“

సుజన ఆలోచిస్తూ వుంది.

మేడం రిటైర్ అయినప్పటి ఫోటోలు చూపారు. మేము సీనియర్ ఇంటర్ లో ఉండగా మేడం ఇరవై రెండు వయసులో కాలేజ్ లెక్చరర్ గా తన ప్రస్థానం మొదలెట్టారు. ఒక టీచర్ రిటైర్ మెంట్ కు అప్పటి విద్యార్థులే కాక ముప్పై అయిదేళ్ల క్రిందటి విద్యార్థులు కూడా రావడం బహుశా చాలా తక్కువ మంది టీచర్ల కు జరిగే గౌరవం అనుకుంటా ఫోటోలు చూసాక. సుజన చేతన్ ని ఆడిస్తూ ఉంటే, నేను సుజన పిల్లల గురించి పడుతున్న వేదన గురించి ,పిల్లల ప్రవర్తన లో అంత మార్పు ఎందుకొచ్చిందో నా కున్న సందేహం కూడా మేడం కు చెప్పాను ,దానికి పరిష్కారం చెప్పమని అడిగాను .

” సుజన నువ్వు ఒక వారం ఇక్కడుండండి” అన్నారు మేడం.

తల ఊపాను..

“చేతన్ తో సుజన ఎంత సంతోషంగా వుందో చూడండి మేడం .. ఆమె నవ్వులు చూడక ఎన్ని రోజులైందో.. గాయత్రి ఎవరు మేడం ? “

సుజన చేతన్ ఎత్తుకుని వచ్చి పడీపడీ నవ్వుతోంది. ముకుంద్ వీడు ట్వింకిల్ ట్వింకిల్ లిట్టిల్ స్టార్ రైమ్ చెబుతాడు విను. చేతన్ చెప్పు కన్నా “ వాడు సిగ్గు పడుతూ తల ని పైకెత్తి స్టార్స్ ని చూపిస్తూ వచ్చీరానీ ముద్దు మాటలతో చెబుతుంటే నిజంగానే మాకు చెప్పలేని సంతోషం కలిగింది.

మేడం, సుజన ఒకరి తర్వాత ఒకరు వాడ్ని ముద్దులాడారు. పసి పిల్లలు ఎంత సంతోషాన్ని తెస్తారు ఇంటికి?

“గాయత్రి నా స్టూడెంటే తన తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా ఓ అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వాడు కొద్దికాలం తర్వాత ఇంకో అమ్మాయిని పెళ్ళిచేసుకుని ఇంటికి తెచ్చి, వద్దన్న గాయత్రిని నిండు గర్భవతిని చంపడానికి ప్రయత్నించాడు. మృతువుతోపోరాడి బ్రతికింది. ఆశ్రయం కోసం వచ్చింది, నిజానికి గాయత్రి రోజా కంటే కూడా ఎక్కువ నాకు. రోషన్,రోజాల పిల్లలు మన దగ్గర వుండరు. మన, పర ఎందుకు ముకుంద్? .ఎవరికీ మనం అవసరమో, ఎవరు మనల్ని ఆశిస్తారో ఎవరు మన ప్రేమని గౌరవిస్తారో వాళ్ళే మనవాళ్ళు. గాయత్రి ఈ రెండేళ్లలో బాగా చదువుకుంది. వుద్యోగం వస్తే వెళ్ళిపోతుంది.. తన జీవితం తాను నిర్మించుకుంటుంది. అది కూడా నేను ఆశిస్తున్నా తన కంటూ ఒక సొంత జీవితం వుండాలని... ”

సుజన మేడం మాటలు వింటూ ఆలోచిస్తోంది.

రాత్రి నా గుండెలపై తలపెట్టుకుని ” ముకుంద్ ఎంతబావుంది కదూ ఇక్కడ ! నాకయితే ఇక్కడే ఉండిపోవాలని వుంది .. ”

“ఉందాం వారం రోజులు”

“ఆహా... ఇక్కడే ఉండి పోదాం “

“సరే ఆలోచిద్దాం”

ఉదయాన్నే గాయత్రి లేపింది ” సార్..మేడం వాకింగ్ వెళుతున్నారు మీరు వస్తారా?” అని అడిగారు.

సుజన ఎగిరి కూర్చుంది.

మేము బయటికి వచ్చేప్పటికి మేడం సార్ కు స్నానం చేపించి వీల్ చైర్ లో కూర్చోపెట్టి సార్ వళ్ళో చేతన్ ను కూర్చో పెట్టి బెల్ట్ వేశారు .. వాడు బుద్ధిగా కూర్చున్నాడు.. సార్ ఏదో మాట్లాడుతున్నాడు కానీ అవి మాకు అర్థం కాలేదు. మేడం వాటికి సమాధానం చెబుతోంది. చేతన్ తో ఆయనేదో నవ్వుతూ చెబుతున్నాడు చేతన్ ఆయన్ని మాటి మాటికీ మెడ చుట్టూ చేతులు వేసి ముద్దు పెడుతున్నాడు. మేడం కి ఇద్దరూ పసివాళ్లే అనిపించింది. ముగ్గురం ఒకరి తర్వాత ఒకరం వీల్ చైర్ ని తోసుకుంటూ వెళ్లాం.

దార్లో వృద్ధాశ్రం తీసికెళ్ళారు. అక్కడున్న కొందరితో మాట్లాడాను. అక్కడ ఏదో నిరాశలో వుండే ముసలివాళ్ళు,రోగులు వుంటారనుకున్నా .. కానీ అక్కడ చాలా అర్థవంతమైన జీవితం నడుస్తోంది. చదువుకున్న వాళ్ళు , నిరక్షరాస్యులు కూడా ఉన్నారట. చాలా విశాలమైన ఆ ప్రదేశంలో మంచి తోట పెట్టారు . పూల మొక్కలతో పాటు ,వరి, కూరగాయలు ,ఆకుకూరలు పండిస్తున్నారు. వాళ్లకు సరిపోయి మళ్ళీ మార్కెట్ కు కూడా వేస్తారట. వాళ్లలో ఎక్కడా నిరాశ కనపడలేదు. చదుకున్న వాళ్ళకోసం చిన్న లైబ్రరీ నడుస్తోంది న్యూస్ పేపర్లు పత్రికలు ,పుస్తకాలు వున్నాయి.అక్కడివాళ్ళతో మేడం మాట్లాడుతుంటే వాళ్ళకళ్ళలో మెరుపు చూశాను ..

"ప్రతిరోజూ వస్తాను ఇక్కడికి --- ఎంతో బావుంటుంది ఈ వాతావరణం" అన్నారు మేడం

"పిల్లలు వుండి కూడా ఇలాంటి చోట ఉండాల్సిన దురదృష్టం పట్టింది కదా మేడం వీళ్ళకి, వీళ్ళను చూస్తుంటే బాధగా వుంది" అంది సుజన

"అదృష్టం దురదృష్టం అనేవి లేవు సుజనా! జీవితాన్ని ఎలా వచ్చినా స్వీకరించాలి. మనకు అనుగుణంగా మార్చుకోగలిగితే మార్చుకోవాలి. మార్చలేనిదాన్ని అంగీకరించి ముందుకు పోవాలి--- పిల్లల్ని మనం దోషులుగా చేయలేం ప్రతి దానికి, వాళ్ళమీద చాలా ప్రభావాలున్నాయి . మన సంస్కారం వాళ్ళకెందుకు రాలేదంటే, వాళ్ళు ప్రపంచపు పోకడల్ని ఎక్కువ చూస్తున్నారు ,వాటికి ఎక్కువ ప్రభావితమవుతున్నారు . మనకాలంలో మనం తల్లి దండ్రులమీద ఎక్కువ ఆధారపడ్డాం, ఎక్కువ సమయం గడిపాం. అందుకని వాళ్ళతో మనకు అనుబంధం వుంది , ప్రతి దానికి వాళ్ళ అనుమతి కోరాం ఒంటరిగా ఏ నిర్ణయం తీసుకోలేకపోయేవాళ్ళం .ఇప్పుడు వీళ్లకు మనం ఇచ్చిన స్వేచ్ఛ , నిర్ణయాన్ని తీసుకునే అధికారం, వాళ్ళని ఎక్కువ స్వతంత్రాన్ని తీసుకునేలా చేశాయి. ఇప్పటి ప్రపంచపు రీతులు,సోషల్ మీడియా, చిన్న వయసులో ఆర్ధిక స్వాతంత్యం యువత పై ఎక్కువ ప్రభావం చూపాయి. ఇక్కడే ఇలావుంటే అమెరికాలో వున్న జీవన విధాన ప్రభావం అక్కడి కెళ్లిన మనవాళ్లపై పడకుండా ఎలా వుంటుంది? అతి కొద్దికాలం లో మనదేశం కూడా అమెరికా లాగే ఉంటుంది మనం అప్పుడు దానికి అలవాటు పడిఉంటాం ."

దార్లో సుజనకు మేడం కు జరుగుతున్న సంభాషణ ఉంటున్నాను.

"పాతికేళ్ళు మనతోవుండి ఈ దేశం ఇచ్చిన చదువును , అవకాశాల్ని ఉపయోగించుకుని మన త్యాగం తో ఎదిగి ఇప్పుడు మా జీవితంలో మీకు చోటు లేదంటే , మన గురించి ఆలోచనే చేయకుంటే మనం ఏమవుతున్నా వాళ్లకు సంబంధం లేదంటే ఎలామేడం ?" సుజన కళ్ళలో నీళ్లు తిరిగాయి.

" సుజనా హృదయ సంస్కారం పనిచేయని చోట ఏదీ పని చేయదు, నాకు తెలిసి అది బాహ్యమైన విషయాలను తెలియజేయడం వలన ఏర్పడదు. సాధారణంగా డబ్బు, కేరియర్ లాంటి వాటికి ప్రాధాన్యత హెచ్చినచోట అది అసలు ఏర్పడదు."

"ఏమో మేడం.. పిల్లలు నన్ను పట్టించుకోవడం లేదని. వాళ్ళు మాకు కాకుండా పోయారని నేను చాలా క్రుంగి పోతున్నాను, ముకుంద్ నా బాధ చూడలేక వాళ్లకు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా, వాళ్ళు లెక్కచేయడం లేదు"

"మన పిల్లలు మనకెప్పుడూ మన ప్రపంచంగా అనిపిస్తూ వుంటారు, పసితనం లో వాళ్లకు మనం తప్ప లోకం తెలియనంతవరకు వాళ్లకు మనమే కదా ప్రపంచం ! తర్వాత కూడా అలా ఎలావుంటారు ? ఇప్పుడు చేతన్ ని మనం ఎలా పెంచామో, ముద్దులాడామో వాడు పెద్దయ్యాక గ్రహిస్తాడంటావా?... ఇది ప్రకృతి ధర్మం సుజనా..మన జీవితం మనం జీవించి..వాళ్ళ జీవితం కూడా మనమే జీవించాలంటే ఎలా సుజనా !"

"అయితే మనమేం చేయాలి మేడం? నాకయితే పిల్లలు లేకుండా పండుగలు లేవు, ప్రతి నిమిషం వాళ్ళు గుర్తొస్తారు. ఒక్క రోజు వాళ్ళు మాట్లాడకపోతే జీవితం శూన్యంగా అనిపిస్తుంది"

" వాళ్లకు నచ్చినట్లు వాళ్ళు గడుపుతున్నారు కదా ! మనం కూడా సమయాన్ని క్వాలిటేటివ్ గా గడపాలి. మనకంటూ వున్నది ఒకటే జీవితం, ఇందులో ఎన్ని ఒడిదుడుకులున్నా, మనం చేయాల్సిన పనులు చేయాలి ,చేయాలనుకున్న పనులు , ఇష్టమైన పనులు చేయాలి. ఉద్యోగ రీత్యా కానీ ,బాధ్యతల వలన కానీ ఇంతకాలం మనకు తీరిక లేదనుకో ఇప్పుడు మనకు సంతోషాన్నిచ్చే స్నేహితుల్ని బంధువుల్ని కలవాలి, మనకిష్టమైన ప్రదేశాలు తిరగాలి. ఒకటి జరగలేదని ఇంకేవీ జరగరాదా సుజనా !"

సుజన దీర్ఘంగా ఆలోచిస్తోంది.

స్థితప్రజ్ఞత తో కూడిన ఆమెను చూస్తూనే వున్నాను ముప్పై అయిదేళ్ల నుండి; వృద్ధాప్యం ఆమెను ఏ మాత్రం అనిశ్చలంగా గానీ చంచలంగా చేయలేదు. బాధలు ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేదు.

భర్త అనారోగ్యం ,అవిటితనం, పిల్లల నిర్లక్ష్యం, కరిగి పోయిన ఆస్తులు , వెడలిపోయిన అంతస్తులు ఏవీ ఆమెను కృంగదీయలేదు .ఎన్ని సమస్యలు ఎదురైనా ఆమె చిరునవ్వు చెదరలేదు , జీవిత సమరానికి ఆమె బెదర లేదు. మాకు, ఇంకా అనేక మంది వయసుమళ్లుతున్న వాళ్ళకి సాధ్యం కానిది ఈమెకు ఎలా సాధ్యమయింది ? సుజన కు ఇప్పుడు రేచల్ మేడం నిజమైన చదువు నేర్పాలి.

"దీపావళికి ఓ స్నేహితురాలు ఇవాళ రాత్రికి భోజనానికి రమ్మంది వెళదాం" అంది మేడం.

"మీరు వెళ్లి రండి మిమ్మల్ని పిలుస్తే మేము వస్తే ఎంబావుంటుంది?" అన్నాను.

"అదేం లేదు మీరున్నారని చెప్పా ..అందర్నీ పిలిచింది"

సార్ తో సహా అందరం వెళ్లాం. మేడం స్నేహితురాలు విజయ ఇంటి ముంగిట్లోకి వెళ్ళగానే ఆ ముగ్గులు, ముగ్గుల్లో అందంగా అలంకరించిన దీపాలు మమ్మల్ని ఆశ్చర్య చకితుల్ని చేశాయి. ప్రక్కనున్న రాంప్ పైనుండి సార్ వీల్ చైర్ ని తీసుకొచ్చాం. ఆ రాంప్ సార్ కోసమే కట్టించారని మేడం చెప్పారు . లోపలికి వెళ్ళాక ఇల్లు మొత్తం ఒక అందమైన కళాఖండంలా అనిపించింది. మమ్మల్ని పలకరించిన వ్యక్తిని చూడగానే నేను సుజన ఆమె క్యాన్సర్ పేషంట్ అని గ్రహించాము. కానీ ఆమె ఎంత చలాకీగా తిరుగుతోందో చూసి ఆశ్చర్యపోయాం. ఆమె మాటలు వింటే, పెదవుల పై కదలాడే చిరునవ్వు చూస్తే...ఆమె ఎంత ఆశావాదో అర్ధమయింది. ఆమె చాలా రకాల వంటకాలు చేశారు. అన్నీ స్వయంగా చేశారట. బాగా చదవడం ,ఇల్లు ,తోట అంత చక్కగా పెట్టుకోవడం ఆమె హాబీ అని మేడం చెప్పారు. కీమో థెరిపి తీసుకుంటున్నట్లు ఆమె పిల్లలు కూడా ఎక్కడో ఉన్నట్లు వాళ్ళిద్దరి సంభాషణ లో తెలిసింది. భర్త మరణించినట్లు ఒక ఫొటోకు పూల దండ వేయడం వలన, అతనామె భర్త అని అతను ఆమె తీసుకున్న ఫోటో వలన తెలిసింది. ఆమె తో మాట్లాడ్డం ఒక ఎడ్యుకేషన్ అనిపించింది . ఆమె పెద్దగా చదువుకోలేదని, డిగ్రీలేవీ లేవని మేడం ప్రోద్భలం తోనే పుస్తకాల చదవడం మొదలెట్టానని ఆమె చెప్పి నప్పుడు మేము నమ్మలేక పోయాము.

విజయ గారి గురించి మేడం చెబుతున్నారు దారిలో. "ఫోర్త్ స్టేజ్ లో వున్న లింఫాటిక్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు . క్యాన్సర్ వచ్చిందని తెలిసి సింగపూర్ లో వున్న కొడుకు కూతురు వచ్చి తీసికెళ్ళి ట్రీట్మెంట్ ఇప్పించారు. ఎక్కువకాలం బ్రతికే అవకాశం లేదని తెలిశాక ఆమె ఇక్కడే వుండాలని నిర్ణయించుకున్నారు . పిల్లలు అప్పుడప్పుడు వస్తుంటారు.భర్త అయిదేళ్ల క్రిందటే మరణించారు. "

"ఆమె ఉక్కు మహిళ లాగా వుంది మేడం.. ఇన్ని సమస్యలతో .. కూడా అంత ఆశావాదమా !"

"జీవితం పై ప్రేమ... బ్రతికిస్తుంది ముకుంద్ ..అదీ చాలా అర్థవంతమైన జీవనం సాగించడానికి"

సుజన ఏమీ మాట్లాడకుండా అలోచిస్తూ ఉండిపోయింది.

మరుసటి రోజు మేం మేడం దగ్గర సెలవు తీసుకున్నాం. "ఈ వారం రోజులు మన పిల్లలు మనకసలు ఫోన్ చేయలేదని నీవు ఒక్క సారి కూడా అనలేదు సుజనా ..!"

"అవును ముకుంద్.. నేను ఇంకెప్పుడూ అలా వాళ్ళ ఫోన్ రాకపోతే ,వాళ్ళు మనల్ని పట్టించుకోలేదని బాధపడను , మంచాన పడ్డ సార్ తో , పట్టించుకోని పిల్లలతో నలుగురికి సహాయం చేస్తూ మేడం ఎంతో సంతోషంగా వుంది కదా! క్యాన్సర్ తో బాధపడుతూ కూడా పిల్లల్ని ఆశించకుండా ఒంటరిగా తనకు నచ్చినట్లుగా వున్న విజయ గార్ని చూశాక , భర్త వదిలేసినా చిన్న బిడ్డని పట్టుకుని తన జీవితాన్ని చదువుతో దిద్దుకోవడానికి ప్రయత్నించే

గాయత్రి , వీళ్ళని చూసి కూడా నేను ఏడిస్తే ఎలా ? నన్ను ప్రాణంలా చూసుకునే నీవుండగా కూడా, లేని వాటి గురించి ఇంతకాలం బాధపడ్డాను, నిన్ను బాధపెట్టాను . ముందుగా పనిలో నిమగ్నమవుతాను , ఇంక ఎప్పుడూ విచారంగా ఉండను . పిల్లల పట్ల కూడా నాకేమీ వ్యతిరేకత లేదు.“

సుజన మాటలు నన్ను చాలా సంతోషపెట్టాయి. థాంక్స్ రేచల్ మేడం అనుకున్నా మనసులో .

★★★★★★★

Click here to share your comments on this story